సాక్షి సూర్యాపేట

శనివారం । 21 । జనవరి । 2023



తాటికల్‌లో వృద్ధుడి హత్య

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్‌లో శుక్రవారం ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. - 8లో



సమన్వయంతో పనిచేయాలి

పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/18°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంపూర్ణత లేని ప్రమోషన్లు విద్యాశాఖ వైఫల్యమే

సూర్యాపేట టౌన్: ఏడున్నర సంవత్సరాల ఎదురుచూపుల అనంతరం ఇస్తున్న ప్రమోషన్లు సంపూర్ణత ఇవ్వలేకపోవడం విద్యాశాఖ వైఫల్యంగానే భావిస్తున్నామని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు కేసులను సాకుగా చూపి పర్యవేక్షణ అధికారుల పోస్టులకు, పండిట్ పోస్టులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి అన్ని పోస్టులకు ప్రమోషన్లు జరిగేలా చూడాలని కోరారు.

'కంటి వెలుగు'కు సహకరించండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక

సూర్యాపేట టౌన్: కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించి విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం ఆమె అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం హుజూర్‌నగర్, నూతనకల్, మఠంపల్లి జెడ్పీటీసీలు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన 500 పైచిలుకు జనాభా గల గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. మిషన్ భగీరథ తాగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను త్వరగా మరమ్మతు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట: జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలల్లో ఇంటర్, ఆపైన విద్యార్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి రెండేళ్ల డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ, ఎక్స్‌-రే టెక్నిషియన్, ఆప్తమాలజీ, హెల్త్ అసిస్టెంట్, థియేటర్ టెక్నిషియన్, స్టెరిలైజేషన్, డయాలసిస్, అనస్థీషియా, ఈసీజీ తదితర కోర్సుల్లో చేరాలనుకునే ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోగా (www.tspmb.telangana.gov.in) వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

అనంతగిరి: పశువైద్య, గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అమీనాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య, గర్భకోశ వ్యాధుల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వంద శిబిరాలను నిర్వహించనున్నట్లు, ప్రస్తుతం తొమ్మిది పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులు అందజేసి జంతు సంక్షేమ పక్షోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కుమార్, సర్పంచ్ కోటేశ్వరరావు, గోపాల్‌రావు, సరితారెడ్డి, కర్నాకర్, ప్రదీప్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. "నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

• ముస్తాబవుతున్న 'పెద్దగట్టు'



చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి జరగనున్న శ్రీలింగమంతుల స్వామి జాతర నేపథ్యంలో ముస్తాబవుతున్న పెద్దగట్టు దేవాలయం.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేట: రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ సుదర్శన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ అందించడంతోపాటు ఈహెచ్‌ఎస్ సౌకర్యం మెరుగుపరిచి నగదు రహితమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు సీతారామయ్య, సంఘం మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదగాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటరు జాబితా సిద్ధం చేయండి

• రాష్ట్ర ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి



మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటర్ల దినోత్సవం రోజున నూతన ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాలమాయాదేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఓటరు జాబితా ప్రచురణకు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా నూతన ఓటర్ల జాబితా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబితాను జిల్లాలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు 4,52,828మంది, మహిళా ఓటర్లు 4,61,817 మంది, అలాగే ట్రాన్స్ జెండర్స్ 23 మంది 477 సర్వీసు ఓటర్లతో కలిపి మొత్తం 9,14,668 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, కిషోర్ కుమార్, వెంకారెడ్డి, ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు పద్మారావు, డీటీ వేణు పాల్గొన్నారు.

పల్లెకు 'యోగ'ం!



జిల్లాకు 12 యోగా కేంద్రాలు మంజూరు

- ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా కేంద్రం చర్యలు
- ఆయుర్వేద వైద్యశాలలున్న గ్రామాలకు ప్రాధాన్యం
- ఒక్కోదానికి రూ.6 లక్షల చొప్పున రూ.72 లక్షలు కేటాయింపు
- త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు

చిలుకూరు: పల్లెకు యోగం పట్టనుంది. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా యోగా ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు యోగా విశిష్టత, సాధనపై అవగాహన కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల యోగా కేంద్రాల నిర్మాణానికి పూనుకుంది. నేషనల్ ఆయుష్ మిషన్ కార్యక్రమం కింద జిల్లాకు 12 యోగా కేంద్రాలు మంజూరు చేసింది. ఒక్కొక్క కేంద్రం నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.72 లక్షల నిధులు కేటాయించి మంజూరు చేసింది.

యోగా కేంద్రాలు ఎక్కడెక్కడంటే..

ఆయుర్వేదిక్ వైద్యశాలలు కొనసాగుతున్న పల్లెలకు ముందుగా ప్రాధాన్యమించారు. ఈ క్రమంలో జిల్లాలో వర్ధనమానకోట (నాగారం మండలం), వట్టిఖమ్మంపహాడ్ (చివ్వెంల), సూర్యాపేట, పెన్‌పహాడ్, పానుగోడు (గరిడేపల్లి), జాన్‌పహాడ్ (నేరేడుచర్ల), బరాఖత్‌గూడెం (మునగాల), పెదవీడు (మఠంపల్లి), లింగగిరి (హుజూర్‌నగర్), అనంతగిరి, నడిగూడెం, మేళ్లచెరువు మండల కేంద్రంలో ఈ యోగా కేంద్రాలు ఏర్పాటవుతాయి. వీటి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిసింది.

నిర్మాణాలు ఇలా..

కాగా నేషనల్ ఆయుష్ మిషన్ నిబంధనల ప్రకారం యోగా కేంద్రాల నిర్మాణాలు చేపట్టాలి. కేంద్రాల్లోకి గాలి, వెలుతురు వచ్చేలా 18 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవుతో భవనాలను నిర్మించనున్నారు. అందుకు తగినట్లుగానే అధికారులు స్థలాలను గుర్తించారు. టెండర్లు దశ పూర్తి కాగానే నిబంధనల ప్రకారం యోగా కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

వారంలో పనులు ప్రారంభిస్తాం



యోగా కేంద్రాలతో ప్రజల ఆరోగ్యం మరింత సురక్షితంగా ఉండనుంది. నిత్యం యోగా సాధన, ఆసనాలు వేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనస్సు కూడా ప్రశాంతగా ఉంటుంది. జిల్లాకు 12 యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. స్థలాల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయింది. మరో వారం రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– డి.శ్రీనివాస్‌రావు, ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ ఇన్‌చార్జి, సూర్యాపేట

కేంద్రానికి ఒక శిక్షకుడు

నిర్మాణాలు పూర్తయిన తరువాత ఒక్కో కేంద్రానికి యోగా శిక్షకున్ని నియమించి ఇతని ద్వారా ప్రజలకు నిత్యం యోగా సాధన చేయిస్తారు. ప్రధానంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందుస్తుగా యోగా ఆసనాలు వేయిస్తారు. ప్రధానంగా ప్రజలకు బీపీ, షుగర్ రాకుండా, లేదా వచ్చిన వారికి ఎలా కంట్రోల్ చేయాలి, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యోగా ట్రిక్స్ చేయిస్తారు. అంతేకాక ప్రజలకు తమ ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులను ఎలా ఎదుర్కోవాలి, వాటి నివారణకు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, మానసికంగా శారీరకంగా మనస్సును ప్రశాంతంగా ఎలా ఉంచుకోవాలో యోగా సాధన ప్రక్రియలో ప్రజలకు నేర్పుతారు.

పీఎస్ఈ ఎంట్రీ వందశాతం పూర్తిచేస్తాం

• కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ఓటర్ల జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీఎస్ఈ) ఫీల్డ్ వెరిఫికేషన్ వందశాతం పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం, పీఎస్ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, ఓటరు ఐడీతో ఆధార్ అనుసంధానం ప్రక్రియపై శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్‌చే జారీ చేసిన సాంగ్‌ను మైక్‌ల ద్వారా వినిపించిన అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించాలని, 80 సంవత్సారాలు వయస్సు పైబడిన ఓటర్లను, నూతన ఓటర్లను సన్మానించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ లింక్ 89 శాతం పూర్తి చేశామని, నూతన ఓటరు కార్డు పంపిణీ పోస్టల్ ద్వారా జరుగుతున్నదని తెలిపారు. ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, వెంకారెడ్డి, కిషోర్ కుమార్, ఎన్నికల సిబ్బంది పద్మారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్రంలో రెండోవ అతిపెద్దదైన శ్రీలింగమంతుల స్వామి (పెద్ద గట్టు) జాతర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో గల శ్రీలింగమంతుల స్వామి జాతర పనులు పరిశీలించి మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరుగనున్న జాతరలో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, తహసీల్దార్ రంగారావు, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్ తదితరులు ఉన్నారు.

అంధత్వాన్ని రూపుమాపుదాం



పెన్‌పహాడ్ : అనాజిపురంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ



జాజిరెడ్డిగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐఓ వెంకటరమణ

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

పెన్‌పహాడ్, నాగారం: కంటి వెలుగు కార్యక్రమంతో అంధత్వాన్ని రూపుమాపుదామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండలం అనాజిపురం, నాగారం మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కంటి సమస్య ఉన్న వారికి ఉచితంగా మందులతో పాటు కళ్లద్దాలు అవసరమైతే శస్త్రచికిత్సకు సిఫార్స్ చేస్తారన్నారు. కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయా శిబిరాల్లో పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, ప్రత్యేక అధికారి శిరీషా, హెల్త్ సూపర్‌వైజర్ వినోద, అప్తోమెటిస్ట్ డాక్టర్ కె.ఉమ, ఎంపీఎస్‌ఓ చింతమళ్ల రమేష్, యాదగిరి, వెంకన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

అర్వపల్లి: పద్దెనిమిదేళ్ల వయస్సు పైబడిన వారంతా కంటి పరీక్షలు చేయించుకొని మందులు, కళ్లద్దాలు ఉచితంగా పొందాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐఓ) పెండెం వెంకటరమణ కోరారు. జాజిరెడ్డిగూడెంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారి ఇబ్బందులను తీర్చడానికే రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మణిదీప్, డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ ఎల్.చరణ్, సబ్ యూనిట్ అధికారి నర్సయ్య, ఆప్తమాలజిస్ట్ ఏ.వేణు, హెల్త్‌అసిస్టెంట్ వీరయ్య, ఏఎన్ఎంలు సైదమ్మ, పి.శకుంతల, సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీలం వెంకటేష్

సూర్యాపేట టౌన్: బీసీలు రాజ్యాధికార సాధన కోసం ఉద్యమించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 8, 9వ తేదీల్లో ఢిల్లీలో జంతర్‌మంతర్, పార్లమెంట్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. దేశంలో ఏడు శాతం ఉన్న అగ్రవర్ణ కులాలలో రెండు శాతంకు మించి పేదలు లేరని విద్యా ఉద్యోగాలల్లో వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ అలాగే బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం రిజర్వేషన్లు పోను, విద్యా, ఉద్యోగ రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో మిగతా 50శాతం రిజర్వేషన్లను జనరల్ కోటాలో ఆధిపత్య కులాల వారే అనుభవిస్తున్నారన్నారు. వారికి మరో 10శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన లింగయ్య యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, భారి అశోక్, మల్లేష్, అంజి, సంతోష్, శ్రవణ్‌కుమార్, నాగరాజు, నవీన్, లక్ష్మణ్, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రవేశాలకు ఆహ్వానం

- 6వ తరగతిలో అడ్మిషన్‌కు దరఖాస్తుల స్వీకరణ
- 7 నుంచి టెన్త్ వరకు ఖాళీ సీట్ల భర్తీకి కూడా..
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఫిబ్రవరి 15 వరకు గడువు
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష
- జిల్లాలో తొమ్మిది మోడల్ స్కూళ్లు



పసునూర్‌లోని మోడల్‌స్కూల్

నాగారం: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూళ్లు) గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పాలిట వరంగా మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల వసతులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తుండటంతో ఏటా మోడల్‌స్కూళ్లలో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. అయితే 2023–24 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి సీట్ల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మెరుగైన వసతులతో పాటు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన అందిస్తుడం, ఫీజుల భారం తగ్గుతుండడంతో ఈ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్షకు పోటీ అధికంగా ఉంటుంది.

ఒక్కో పాఠశాలలో వంద సీట్లు

జిల్లాలో 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో 100 సీట్ల చొప్పున జిల్లాలో 900 సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్‌ల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.

వసతులు ఇలా

- ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన ఉంటుంది.
- గ్రంథాలయాలు, ఆధునాతన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు విశాలమైన గదులు, ఆటస్థలం, ఉచిత భోజన, హాస్టల్ వసతులు కల్పిస్తారు.
- పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఎస్ఎస్ఎస్‌తోపాటు, ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్, ఐఐటీ కోచింగ్ ఇస్తారు.
- క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌ల కోసం ప్రత్యేక కోచింగ్ ఇస్తారు.
- ఒక్కో పాఠశాలలో సుమారు 800 వరకు విద్యార్థులు ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఫిబ్రవరి15 తేదీ వరకు గడువు ఉంది. అర్హత గల విద్యార్థులు అడ్మిషన్ల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన తరువాత ఒక కాపీని మోడల్ స్కూల్‌లో సమర్పించాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.రమేష్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్ పసునూర్

పరీక్ష సిలబస్ ఇదే..

ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 5వ తరగతి సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలు తెలుగు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలు, ఇంగ్లిష్ ఐదు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగానికి 20 మల్టీపుల్ చాయిస్‌లో అబెక్టివ్ ప్రశ్నలు 20 మార్కుల చొప్పున 100 మార్కులకు ఉంటాయి. 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశ పరీక్షలో అంతకంటే వెనుక తరగతి సెలబస్‌కు సంబంధించి ఇంగ్లిష్, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో 25 మార్కుల చొప్పున 100 మార్కులు ఉంటాయి.

దరఖాస్తు చేసే విధానం

కాగా 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు ఇప్పటికే ఈ నెల 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ ప్రక్రియను ఫిబ్రవరి–15తో ముగియనుంది. 5వ తరగతి పాసైన విద్యార్థులు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఏ మీడియం వారైన దరఖాస్తులు చేసుకోవచ్చు. విద్యార్థులు ఆధార్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను అడ్మిషన్లు పొందాలనుకుంటున్న పాఠశాలల్లో అందజేయాలి. ఏప్రిల్ 16న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.

28న రథసప్తమి వేడుకలు

అర్వపల్లి: తెలంగాణలోని తొలి సూర్యక్షేత్రమైన జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో గల తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఈ నెల 28న నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏడాదికోసారి జరిగే రథసప్తమి రోజున స్వామి మూల విరాట్‌పై సూర్యకిరణాలు పడనుండటంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి తిలకిస్తారు. అదేరోజు క్షేత్రం ఎదుట తమిళనాడులోని మహాబలిపురంలో తయారు చేయించిన ఏకచక్రాన్ని ప్రతిష్ఠంచనున్నారు. రథసప్తమి రోజు ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం మహాసౌరహోమం, సాయంత్రం ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవం జరుగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నట్లు సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలిపారు.



సూర్యక్షేత్రంలోని ఉషాపద్మినిఛాయ సమేత సూర్యనారాయణస్వామి

పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

• ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పెండింగ్ కేసుల నమోదు, వివరాలు, కోర్టు కేసుల స్థితిగతులు, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీస్ పని విభాగాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా పనిచేసే సిబ్బందికి ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా రివార్డ్స్ అందుతాయని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు సమాచారంతో నిరోధించవచ్చని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సాదరంగా ప్రవర్తించాలని, వారికి భరోసా నమ్మకం కలిగించే విధంగా రిసెప్షన్ సిబ్బంది వ్యవహరించాలన్నారు. కమ్యూనిటీ కార్యక్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉండి సామాజిక రుగ్మతలు, చట్టాలు, భద్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. పోలీసింగ్ విధి విధానాలు, స్టేషన్ నిర్వహణపై డీఎస్పీలు, సీఐలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలని, సిబ్బందికి అవసరమైన సలహాలు సూచనలు అందించాలని చెప్పారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, ఏఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, సర్కిల్ సీఐలు సోమనారాయణసింగ్, రాజేష్, నాగార్జున, రాజశేఖర్, శివశంకర్, ఆంజనేయులు, పీఎండీ ప్రసాద్, రామలింగారెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాటికల్‌లో వృద్ధుడి దారుణ హత్య

• గొంతు నులిమి చెరువులో పడేసిన బావమరిది, అతడి ఇద్దరు కుమారులు
• భూ వివాదాలతోనే ఘాతుకం
• పోలీసుల అదుపులో ఒకరు.. పరారీలో ఇద్దరు


కన్నీరుమున్నీరవుతున్న హతుడి భార్య, కుటుంబ సభ్యులు


ఘటన స్థలం వద్ద విచారణ జరుపుతున్న సీఐ వెంకటయ్య తదితరులు

నకిరేకల్ : భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, హతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన ఆకిటి వెంకటయ్య (62) చిన్నతనంలో తాటికల్ గ్రామానికి వచ్చి స్థిరపడిపోయాడు. ఈ గ్రామ వాసినే వివాహం చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా, అందరికీ వివాహాలు జరిపించాడు.

ఏళ్లుగా బావమరిదితో భూ వివాదం

వెంకటయ్య సొంత బావమరిది అయిన ఇదే గ్రామ వాసి వనం సైదులుతో కలిసి కొన్నేళ్ల క్రితం తాటికల్ శివారులోని గుట్ట వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. అయితే, ఈ భూమి విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో 2013లో వనం సైదులు తన బావ వెంకటయ్యపై దాడి కూడా చేశాడు. అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా రెండు కుటుంబాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

చెరువులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందాడన్న సమాచారం అందుకున్న సీఐ వెంకటయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన తండ్రిది అనుమానాస్పద మృతి కాదని వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులు నాగరాజు, గోపి చెరువు వద్ద కాపుకాసి హత్య చేశారని హతుడి కుమారుడు ఆకిటి సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటకయ్య హత్యకు రెండు కుటుంబాల మధ్య పాత కక్షలు, భూ తగాదాలు, మరేమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఈ కేసులో సైదులు పెద్ద కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా సైదులు, అతడి చిన్న కుమారుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.


వెంకటయ్య మృతదేహం

గ్రామంలో ఉద్రిక్తత

సమీప బంధువులే ఆకిటి వెంకటయ్య (52)ను హత్య చేసినట్టు వార్త దహనంలా వ్యాపించడంతో తాటికల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాటికల్ గ్రామంలో వారం రోజుల క్రితం భూ తగాదాల నేపథ్యంలో ఓ వర్గం వారు మరో వర్గం వారి ఇంటిపై గొడ్డళ్ల ,కత్తులతో దాడి చేసి బీభత్సం చేసి మహిళను బెదిరించిన విషయం తెలసిందే. తాజాగా ఇదే గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవల్లో ఒకరి హత్య జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చెరువు వద్ద మాటేసి..

భూ వివాదం నేపథ్యంలో సైదులు బావ వెంకటయ్యపై కోపం పెంచుకుని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అదును కోసం వేచి చూస్తున్నాడు. అయితే ఆకిటి వెంకటయ్య రోజు మాదిరిగా శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి సమీపంలోని ముత్యాలమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే తన ఇద్దరు కుమారులు నాగరాజు, గోపితో మాటేసి ఉన్న సైదులు ఒక్కసారిగా వెంకటయ్యపై దాడి చేశారు. ముగ్గురు కలిసి వెంకటయ్య గొంతు పిసికి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్టు చిత్రీకరించి అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సేపటి తర్వాత అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు చెరువులో వెంకటయ్య మృతదేహం తేలియాడుతూ ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.
ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40783, 96660 13544
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

డంపింగ్ యార్డును తొలగించాలి


వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

అనంతగిరి: మండల పరిధిలోని వెంకట్రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కోదాడ మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలని గ్రామస్తులు శుక్రవారం డంపింగ్ యార్డ్ వద్ద ధర్నా చేశారు. చెత్తను వేసేందుకు వచ్చిన కోదాడ మున్సిపాలిటీ ఆటోలు, ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా గత కొన్నేళ్లుగా అనేక రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, గాలితోపాటు, భూగర్భజలాలు కూడా విషపూరితమవుతున్నాయన్నారు. గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో స్వల్ప వాగ్వాదం నెలకొంది. అనంతరం స్థానిక ఎంపీటీసీ గింజుపల్లి రమేష్ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ నెల రోజుల్లో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ధనమూర్తి, వెంకటేశ్వర్లు, వేదాంతరావు, వెంపటి వెంకటేశ్వరరావు, దామోదర్, రేవెళ్ల కృష్ణ, సర్పంచ్ రాణిజాన్, సత్యనారాయణ ఉన్నారు.

పురుగుల మందు తాగి ఇద్దరి ఆత్మహత్య

• ఆర్థిక ఇబ్బందులే కారణం
• చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఘటన

చిట్యాల : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిట్యాల మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన పసునూరి వెంకటేశ్వర్లు(55)కు వివాహం కాగా భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయినప్పటికీ వెంకటేశ్వర్లు నార్కట్‌పల్లి మండలానికి చెందిన తన చినమామ కూతురు వరుసకు మరదలైన, ఇద్దరు కుమారులున్న ధనలక్ష్మి(45)ని తీసుకుని 18 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడే హస్తినాపురంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ ధనలక్ష్మి ఆమె ఇద్దరు కుమారులతో కలిసి సహజీవనం చేస్తున్నాడు.

అప్పులు అధికమై..

అయితే, వెంకటేశ్వర్లుకు ఇటీవల కాలంలో అప్పులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక సహజీవనం చేస్తున్న ధనలక్ష్మితో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం సాయంత్రం ఇద్దరు కుమారులను అక్కడే ఉంచి ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని రసాయన పరిశ్రమ సమీపంలోని కొంటుగుట్టల్లోకి చేరుకున్నారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందును కూల్ డ్రింక్స్‌లో కలుపుకుని ఇద్దరు తాగారు. అయితే, తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని, వెలిమినేడు శివారులోని గుట్టల్లో ఉన్నట్లు ధనలక్ష్మి తమ బంధువులకు ఫోన్‌లో అదే రోజు సాయంత్రం సమాచారం ఇచ్చింది.

అర్ధరాత్రి వరకు వెతికినా..

ధనలక్ష్మి ఫోన్‌లో ఇచ్చిన సమాచారం మేరకు ఆమె బంధువులతో పాటు పోలీసులు వెలిమినేడు శివారులోని గుట్టల్లో గురువారం అర్ధరాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం మరోమారు వెతకడంతో వారు గ్రామ శివారులోని కొంటుగుట్టపై ధనలక్ష్మితో పాటు వెంకటేశ్వర్లు విగతజీవులుగా కనిపించారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, తాము అప్పుల బాధతోనే అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు మృతుల వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరి మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. మృతుడు వెంకటేశ్వర్లు మొదటి భార్య కుమారుడు అవినాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల పోలీసులు తెలిపారు.


ఘటనా స్థలంలో వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి మృతదేహాలు

దామెరలో ఉరేసుకుని యువకుడు..


హరీష్ మృతదేహం

చౌటుప్పల్ : మండల పరిధిలోని దామెర గ్రామంలో శుక్రవారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఊడుగు లక్ష్మణ్‌దాస్‌గౌడ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి కుమార్తెతో పాటు కుమారుడు ఊడుగు హరీష్‌గౌడ్(19) ఉన్నారు. కుమారుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల హరీష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అందులో భాగంగా పదిహేను రోజులుగా ఇంటి వద్దే ఉన్నప్పటికీ తల్లిదండ్రులతో మాట్లాడకుండా దిగాలుగా ఉన్నాడు. ఏం జరిగిందని అడిగినా ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఆ క్రమంలో శుక్రవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఆటో కిరాయికి వెళ్లిన తండ్రి గంట సేపటి తర్వాత తిరిగి వచ్చాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లగా కుమారుడు పూజ గదిలో దూలానికి చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం


రాజుగౌడ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : ఆర్థిక ఇబ్బందులతో గీత కార్మికుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ ఘటన మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల రాజుగౌడ్(35) కులవృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాడు. రోజుమాదిరిగానే గురువారం సాయంత్రం కల్లు గీసేందుకని స్నేహితుడి బైక్ తీసుకొని ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం రాత్రి 6.30 గంటల సమయంలో తండ్రి ముత్యాలుతో పాటు కూతురు కావ్యకు ఫోన్ చేసి అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, తనకు జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని తెలిపాడు. అనంతరం ఫోన్‌స్విచాఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాజు కోసం రాత్రంతా చుట్టుపక్కల, తెలిసిన చోటల్లా వెదికినా ఆచూకీ లభించలేదు.

దేశ్‌ముఖి శివారులో చెట్టుకు ఉరివేసుకొని..

కాగా బత్తుల రాజు గురువారం రాత్రి దేశ్‌ముఖి శివారులోని మోడల్‌హిల్స్ వెంచర్‌లోని వేపచెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. శుక్రవారం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన దాసర్ల శ్రీశైలం అటుగా వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి భయపడి, విషయం గ్రామస్తులకు, ఇటు పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

• పెద్దగట్టు ముస్తాబు

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జాతర జరగనుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదేవిధంగా ఆలయానికి రంగులు ఇతర సుందరీకరణ పనులు చేస్తున్నారు.
– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సూర్యాపేట


పెద్దగట్టు ఆలయానికి వెళ్లే దారిలో సింహద్వారం


పెద్దగట్టుపైన వేస్తున్న పందిళ్లు


ఆలయానికి వెళ్లే దారిలో విద్యుత్ బల్బులు అమర్చుతున్న సిబ్బంది



ఆలయానికి రంగులు వేస్తున్న కూలీలు, నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

• హుస్సేన్‌బాద్ వాసి హైదరాబాద్‌లో బలవన్మరణం
• భవనం పైనుంచి దూకి అఘాయిత్యం
• స్వగ్రామంలో విషాదఛాయలు


నవ్య(ఫైల్)


మోతె : కుటుంబ కలహాలు ఓ వివాహిత ప్రాణం తీశాయి. మోతె మండలం హుస్సేన్‌బాద్ వాసి హైదరాబాద్‌లో భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన బైరపంగు నవ్య (25) ఇదే గ్రామానికి చెందిన కిరణ్ ఎనిమదేళ్ల క్రితం ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న ఓ భవంతికి వాచ్‌మెన్లుగా ఉంటూ అక్కడే నివసిస్తున్నారు. అయితే, సాఫీగా సాగుతున్న వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నవ్య తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే నవ్య శుక్రవారం తెల్లవారుజామున తాము నివసిస్తున్న భవంతి పైనుంచి దూకి అఘాయిత్యానికి ఒడిగట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మిన్నంటిన రోదనలు

కాగా, ఆత్మహత్య చేసుకున్న నవ్య మృతదేహానికి హైదరాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామం హుస్సేన్‌బాద్‌కు తీసుకొచ్చారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కళ్లెదుటే విగతజీవిగా కనిపించడంతో నవ్య తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తల్లిని కోల్పోయిన చిన్నారులను హత్తుకుని గుండెలవిసేలా రోదించారు.

వరిలో తెగుళ్ల ఉధృతి.. నివారణ చర్యలు

• కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భరత్ సూచనలు



త్రిపురారం : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న వరి పంటలకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంది. దీని నివారణకు తప్పనిసరిగా సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం వరి పంటలో శాస్త్రవేత్తలు గుర్తించిన చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కేవీకే కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్ మాటల్లో..

కాండం తొలుచు పురుగు నివారణకు..

వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున నివారణకు 2 గ్రాముల కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గులికలు లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ గులికలు ఎకరం పొలానికి వేసుకోవాలి.


త్రిపురారంలో అగ్గితెగులు సోకిన వరి పైరు

పాడి పంట

వరి ఆకులు ఎండిపోతుంటే..

వరి పంటలో ఆకులు ఎండిపోతూ, పంట గిడసబారి అగ్గి తెగులును గుర్తించిన వెంటనే నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలిన్ లేదా 2.5 మి.లీగాను మైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఉల్లికోడు పురుగు నివారణకు..

వరి పంటలో ఉల్లికోడు పురుగు ఉధృతిని గమనించిన వెంటనే నివారణకు 2 మి.లీ కార్బోసల్ఫాన్ లేదా ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ లేదా 4 కిలోల ఫిప్రోనిల్ 0.6 జి గులికలను ఎకరానికి వేసుకోవాలి.

కాలిబాటలు తప్పనిసరి

వేసవి కాలంలో పొలం నాటిన తర్వాత ఉత్తరం – దక్షిణం ఉండే విధంగా ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్లు ఉండేటట్లు తప్పనిసరిగా కాలిబాటలు తీసుకోవాలి. దీంతో వరి పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది. కాలి బాటల్లో నడుచుకుంటూ ఎరువులు చల్లుకోవడం, పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చు. అదేవిధంగా చలి ఉధృతి ఎక్కువగా ఉండడంతో వరి పంట వేర్లు కుళ్లిపోయి వాసన రావడం జరుగుతుంది. రైతులు సకాలంలో పంటను గమనించి నివారణకు వెంట్రుక మందం తేమ ఉండేవిధంగా ఎండగట్టాలి. అదేవిధంగా కార్బండిజమ్ ఒక గ్రాము లేదా ప్రోపకోనాజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.